


## శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు.. భక్తజనసంద్రంగా కోటప్పకొండ..

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటిగా ప్రఖ్యాతి గాంచిన శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారి దర్శనం కోసం శ్రీశైల క్షేత్రానికి భారీగా తరలివస్తున్నారు భక్తులు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు, శ్రీశైలం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. సోమవారం స్వామి, అమ్మవార్లు పుష్ప పల్లకిలో విహరించారు. శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్స వేడుకలతో ఇల కైలాసాన్ని తలపిస్తోంది. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు మంగళవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. సాయంత్రం గజవాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక ఈ ఏడాది దేవాదాయ శాఖ భక్తులకు కొత్త సేవా కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. భక్తుల కోసం ఉచితంగా లడ్డూల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. సోమవారం నుంచి ప్రతి భక్తునికి 50 గ్రాముల లడ్డు ప్రసాదాన్ని అందజేస్తున్నారు ఆలయ సిబ్బంది. లక్షలాదిమంది భక్తులు శ్రీశైలంలో స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తున్నారు. సోమవారం నుంచి గురువారం వరకు నాలుగు రోజులపాటు భక్తులకు లడ్డూ పంపిణీచేయనున్నారు. అమ్మవారి ఆలయ వెనుక భాగంలో పశ్చిమ గోపురం వద్ద ప్రసాదాన్ని భక్తులకు అందిస్తున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో ఆంధ్ర శబరిమలగా ప్రసిద్ధిచెందిన అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదియోగి విగ్రహం నిర్మించారు. భారతదేశంలో అతిపెద్ద ఆదియోగి విగ్రహాలు బెంగళూరు, కోయంబత్తూరులలో ఉండగా ద్వారపూడి అయ్యప్ప దేవాలయంలో 60 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పుతో మూడో అతి పెద్ద విగ్రహం రూపుదిద్దుకుంది. ఆదియోగి విగ్రహం వెనుక భాగం నుంచి లోపలకు వెళ్లేందుకు ప్రవేశమార్గం ఉంది. అందులో శివలింగం ఏర్పాటు చేయనున్నారు. అక్కడే ధ్యానమందిరం నిర్మిస్తున్నారు.

పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కోటప్పకొండ శివరాత్రి శోభ సంతరించుకుంది. కోటప్పకొండ మహాశివరాత్రి తిరునాళ్లను రాష్ట్ర పండుగగా గుర్తించడంతో మరింత ప్రాధాన్యత పెరిగింది. ఏపీ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం అనేకమంది భక్తులు కోటప్పకొండ తిరునాళ్లకు తరలివస్తారు. ఈ ఏడాది దాదాపు 15 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనావేస్తున్నారు. భక్తులు కొండకు వచ్చి పోయే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. దాదాపు 3వేల మంది పోలీస్ సిబ్బంది పండుగకు విధులు నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి పండుగ రోజున త్రికోటేశ్వరునికి ప్రత్యేక అలంకారాలతో అభిషేకాలు, పంచ హారతులు, మహా నివేదనములతో పూజలు నిర్వహిస్తారని తెలిపారు ఆలయ అర్చకులు. కోటప్పకొండలో మహాశివరాత్రికి ప్రభల ప్రదర్శన అత్యంత వైభవంగా జరుగుతుంది. ప్రభల బండ్లకు కావలసిన ఎడ్లపై ప్రజలు అత్యంత శ్రద్ధ చూపుతారు. ప్రభలను రంగురంగుల కాగితాలతో అందంగా అలంకరిస్తారు. కొన్ని ప్రభలకు విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేస్తారు. ఈ ప్రభల ఊరేగింపులో మొక్కులు మొక్కుకుంటు ప్రభ ముందు నడుస్తూ కోటప్పకొండకు చేరుకుంటారు. ప్రభ ముందు తప్పెట వాయిద్యాన్ని గమకాలతో సాగిస్తూ వుంటే వాయిద్యానికి తగినట్టుగా బండికి కట్టిన ఎద్దులు ఠీవిగా నడుస్తాయి. గ్రామాలగుండా ప్రయాణించేటప్పుడు గ్రామస్తులు ఎదురు వచ్చి స్త్రీలు కడవలతో వార పోయగా, పురుషులు కత్తి చేత బట్టి, దండకాలు చదువుతారు.

## చంద్రబాబు మరో ఎన్నికల హామీ అమలు - యువత కు కొత్తగా..!!

అమరావతి : ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు దిశ గా కసరత్తు మొదలు పెట్టింది. తాము అధికారంలోకి వస్తే వర్క్ ఫ్రం హోం విధానం అందుబాటు లోకి తెస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు అమలు దిశగా కార్యాచరణ మొదలైంది. ఈ మేరకు సర్వే మొదలు పెట్టారు. ఇంటింటికి వెళ్లి ఈ విధానం అమలు పైన ఆరా తీస్తున్నారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వరకు ఉన్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా కొత్త ప్రణాళికలు సిద్దం చేస్తున్నారు.

**ప్రభుత్వం కసరత్తు...**ఏపీ ప్రభుత్వం వర్క్ ఫ్రం హోం అమలు దిశగా కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానం పైన సర్వే మొదలు పెట్టింది. ఇంటింటికి అధికారులు వెళ్లి వర్క్ ఫ్రం హోం చేస్తున్నారా అనే అంశం పైన ఆరా తీస్తోంది.

ఈ రకంగా పని చేసుకోవటానికి ఉన్న సమస్యలు ఏంటని తెలుసు కొనే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కోరుకుంటున్నారని వివరాలు సేకరిస్తోంది. ప్రతీ ఇంటికి సచివాలయ సిబ్బంది వెళ్లి వారి వివరాలు సేకరిస్తున్నారు. వచ్చే నెల 10వ తేదీ లోగా ఈ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

**సర్వే నివేదికలతో**... సర్వేలో సేకరించిన ఆధారాల ను క్రోడీకరించి ప్రభుత్వం ఈ విధానం అమలు పైన కార్యాచరణ ఖరారు చేయనుంది. వివిధ సంస్థల కోసం ప్రస్తుతం ఇళ్ల నుంచి పని చేస్తున్న వారికి మెరుగైన సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇందు కోసం బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ, దాని స్పీడ్, విధి నిర్వహణకు గదుల కొరత తదితరాలను ఈ సర్వేలో గుర్తించే ప్రక్రియ



మొదలు పెట్టారు. ఇందుకు అనుగుణంగా విద్యార్హత కలిగిన వారిని గుర్తిస్తున్నారు. వారి భవిష్యత్ ప్రణాళిక లు.. వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పిన గురించి వివరించనున్నారు.

**ప్రత్యేక సెంటర్లు...** అర్హత ఉన్న వారికి ఇంటి నుంచే పని చేయడానికి ఎలాంటి సదుపాయాలు కావాలి వర్క్ ఫ్రం హోం సదుపాయం కల్పించేందుకు ప్రైవేట్ భవనాలు అందుబాటులో ఉన్నాయా అనే వివరా లనూ సేకరిస్తున్నారు. ఒకే ప్రాంతంలో ఎక్కువమంది వర్క్ ఫ్రంహోం చేసేందుకు సుముఖంగా ఉంటే అలాంటిచోట ఒక సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

సర్వే పూర్తయ్యాక వివిధ ఐటీ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించాలని భావిస్తోంది. ఈ మేరకు వారి ప్రాంతాల్లోనే పని చేసుకొనేలా అవకాశం కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. సర్వే పూర్తయిన తరువాత మొత్తం ప్రక్రియ పైన స్పష్టత రానుంది.




## ఎమ్మెల్సీ ఎన్నికలు.. భారీగా భద్రతా ఏర్పాట్లు

అమరావతి : ఏపీలో గురువారం మూడు స్థానాలకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పోలింగ్‌తో పాటు ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. అందుకోసం.. అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో మొత్తం 6,62,100 మంది ఓటర్లు ఉన్నారు. కాగా.. రెండు నియోజకవర్గాల్లో 60 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మొత్తం 939 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలు జరుగనున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 10 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

ఈ నియోజకవర్గానికి 22,493 మంది ఓటర్లు ఓటు హక్కు ను వినియోగించుకోనున్నారు. దీనికోసం ఉత్తరాంధ్ర జిల్లాల్లో 123 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన మొత్తం 17 జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలు విస్తరించాయి. పోలింగ్ కోసం 8500 మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు అధికారులు.

## సత్యవర్ధన్‌ను హైదరాబాద్, విశాఖకు ఎవరు తీసుకెళ్లారు?: వంశీని ప్రశ్నించిన పోలీసులు



విజయవాడ: వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ రెండో రోజు కస్టడీ విచారణ కొనసాగుతోంది. నగరంలోని కృష్ణలంక పీఎస్‌లో వంశీని పోలీసులు విచారిస్తున్నారు. ఆయనతో పాటు మరో ఇద్దరు నిందితులు శివరామకృష్ణ ప్రసాద్, లక్ష్మీపతిని కూడా పీఎస్‌కు తీసుకొచ్చారు. వంశీతో పాటు మిగిలిన ఇద్దరిని ముగ్గురు ఏసీపీలు వేర్వేరుగా విచారిస్తున్నారు. సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల వెనుక ఎవరున్నారని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. సాంకేతిక సాక్ష్యాల ఆధారంగా నిందితుల నుంచి సమాధానాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. సత్యవర్ధన్‌ను హైదరాబాద్, విశాఖకు ఎవరు తీసుకెళ్లారని వంశీని ప్రశ్నించినట్లు సమాచారం. నేడు సాయంత్రం 5 గంటల వరకు విచారణ కొనసాగనుంది.




తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం (ఫిబ్రవరి 26) తెల్లవారు జామున కరూర్ జిల్లా కుళితలై హైవే పై బస్సు, కారు ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ప్రయాణిస్తున్న ఒకేకుటుంబానికి చెందిన నలుగురు, కారు డ్రైవర్ సజీవద హనమయ్యారు. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలార్పారు. కారులో ఉన్న మృతదేహాలను బయటికి తీసి పోస్ట్ మార్టమ్‌కు తరలించారు. ఒరతనాడులోని కీలైయూర్ లోని అగ్నివీరనార్ ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కోయంబత్తూర్ లోని కునియ ముత్తూరుకు చెందిన వారిగా గుర్తించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో ఇద్దరు మహిళలుఉన్నారు.

## అమెరికా జనాభా కంటే ఎక్కువ.. మహా కుంభమేళాపై విదేశీ మీడియా ప్రశంసలు



ప్రయాగ్ రాజ్ మహాకుంభమేళాకు నేడు చివరి రోజు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. జనవరి 13న ప్రారంభమైన ఈ జాతర ఫిబ్రవరి 26న ముగియనుంది. ఈ మహాకుంభమేళా యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఈ భారీ జాతరను ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. ఈ జాతర సందర్భంగా నాగ సాధువులు, అమృత్ స్నానాల భారీ ఊరేగింపు అందరి దృష్టిని ఆకర్షించింది. అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది ఇప్పటి వరకు 64 కోట్లకుపైగా భక్తులు వచ్చారు. ఇది విదేశీ మీడియా దృష్టిని కూడా ఆకర్షించింది.

**అమెరికా జనాభా కంటే ఎక్కువ...** విదేశీ మీడియా కూడా మహా కుంభమేళా సమగ్రత, మతపరమైన ప్రాముఖ్యతను ప్రముఖంగా కవర్ చేసింది. అమెరికాలోని మొత్తం జనాభా కంటే ఎక్కువ మంది యాత్రికులు మహా కుంభమేళాకు వచ్చారని, ఈ ఆరు వారాల వ్యవధిలో ఈ సంఖ్య దాదాపు 500 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదించింది. హఫింగ్టన్ పోస్ట్ మహా కుంభమేళాను ప్రపంచంలోనే అతిపెద్ద తీర్థయాత్రగా అభివర్ణించింది. ఆచారాలు, నమ్మకాలను వివరించింది.

**శివరాత్రి రోజున భారీగా స్నానాలు...** ప్రభుత్వ లెక్కల ప్రకారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున 2 గంటల వరకు 11.66 లక్షల మంది భక్తులు సంగమం పుణ్యస్నానాలు ఆచరించారు. ఆ తర్వాత రెండు గంటల్లో ఈ సంఖ్య 25.64 లక్షలకు, ఉదయం 6 గంటలకు 41.11 లక్షలకు పెరిగింది. ఉదయం 10 గంటల వరకు 81.09 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. త్రివేణి సంగమం గంగ, యమున, సరస్వతి నదుల వద్దకు భక్తులు భారీగా తరలివచ్చారు.

**సాంకేతికత...** భద్రత, సమన్వయాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించిన ఈ ఏడాది కార్యక్రమాన్ని డిజిటల్ మహాకుంభ్‌గా అభివర్ణించినట్లు రాయిటర్స్ నివేదించింది. అదే సమయంలో ఈ కార్యక్రమానికి వచ్చిన నాగ సాధువులు సంప్రదాయబద్ధంగా సంగంలో స్నానమాచరించి పూజలు చేస్తుండటాన్ని సీఎన్ఎన్ ప్రచురించింది. కుంభమేళాను భక్తులు, పర్యాటకులు, రాజకీయ నాయకులు, ప్రముఖులను ఆకర్షించే పవిత్ర ఘట్టంగా న్యూయార్క్‌టైమ్స్ తన సోషల్ మీడియా పోస్టుల్లో పేర్కొంది. ఇప్పుడు ఈ కార్యక్రమం ముగింపు దశలో ఉండటంతో ఈ ప్రాంతాన్ని శుభ్రం చేసి నిర్వహించడం పెద్ద సవాలుగా మారనుంది.

## 2026 ఎన్నికల్లో చరిత్రను తిరగరాస్తాం.. తలపతి విజయ్ సంచలన వ్యాఖ్యలు



రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో గెలుపొంది తమిళ రాజకీయాల్లో (చరిత్రను తిరగరాస్తామని తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడు తలపతి విజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మహాబలిపురం లో నిర్వహించిన టీవీకే పార్టీ మహానాడును అట్టహాసంగా నిర్వహించారు. ఈ బహిరంగ సభకు ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కూడా హాజరకావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా సభలో తలపతి విజయ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2026లో రాబోయే సాధారణ ఎన్నికల్లో ఎవరు ఎన్ని కుట్రలు చేసిన గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. పెత్తందార్లు, భూస్వాములు వాళ్ల స్వార్థం కోసం రాజకీయాల్లోకి వచ్చిన ఆరాచకాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రశ్నిస్తే.. తమ పార్టీ నేతలపై ఎక్కడికక్కడ అక్రమ కేసులు పెడుతున్నారని ఫైర్ అయ్యారు. రాబోయే ఎన్నికల్లో ఎలాగైన గెలిచి అసెంబ్లీకి వెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. తమిళగ వెట్రి కళగం పార్టీ ఎప్పుడైన సామాన్యులకే రాజ్యాధికారం కల్పిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇంత అవినీతి, అక్రమాలు జరుగుతున్నా.. కేంద్రంలోని బీజేపీ చోద్యం చూస్తోందని మండిపడ్డారు. డీఎంకే, బీజేపీ పార్టీలు లోపాయకారి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. అదేవిధంగా 1967లో తమిళ రాజకీయాల్లో పెనుమార్పులు వచ్చాయని.. మళ్లీ 2026లోనూ అదే సీన్ రిపీట్ కాబోతోందని జోస్యం చెప్పారు. త్వరలోనే తమ పార్టీలోకి కీలక నేతల చేరికలు ఉంటాయని తలపతి విజయ్ అన్నారు.




తాళ్లపూడి: తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడిలో విషాదం చోటుచేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతిచెందారు. మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 11 మంది యువకులు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో లోతుగా ఉన్న ప్రదేశాన్ని గుర్తించకపోవడంతో వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగిపోయారు. ఈ క్రమంలో ఒకరినొకరు రక్షించుకునే ప్రయత్నంలో ఆ ఐదుగురూ గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతులు టి.పవన్ (17), పి. దుర్గాప్రసాద్ (19), పి.సాయి కృష్ణ (19), ఎ. పవన్ (19), జి.ఆకాశ్ (19)గా గుర్తించారు. వీరంతా కొవ్వూరు, తాళ్లపూడి, రాజమహేంద్రవరంలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు. యువకులంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో విషాదఛాయలు అలముకున్నాయి. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్ గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

## బీజేపీలోకి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి.. స్వయంగా క్లారిటీ ఇచ్చిన కాంగ్రెస్ నేత




కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరూ ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చిన డీకే శివకుమార్.. ఇటీవల పార్టీ కార్యక్రమాలకు కాస్త దూరంగా ఉంటున్నారు. దీంతో ఆయన తనకు సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. పార్టీ మారేందుకు సిద్ధం అయ్యాడని, ఈ క్రమంలో కాంగ్రెస్ అధిష్టానంతో అంటీముట్టనట్లు ఉంటున్నాడని సోషల్ మీడియాతో పాటు మీడియాలో వార్తలు వచ్చాయి. కాగా ఈ వార్తలపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కే.శివకుమార్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "నేను కొన్ని మీడియా మరియు సోషల్ మీడియా లో చూశాను. నేను బీజేపీకి దగ్గరవుతున్న అని నా స్నేహితులు కాల్ చేసి నన్ను అడుగుతున్నారు. నేను జన్మతా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను నేను ఎప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతాను అని చెప్పుకొచ్చారు. అలాగే తాను మహా కుంభమేళకు వెళ్లడంపై స్పందిస్తూ.. మహాకుంభ్ సందర్శన నా విశ్వాసం. నేను అన్ని మతాలను గౌరవిస్తాను. బీజేపీకి నేను దగ్గరవుతున్నాననే ఊహాగానాలు నాకు దగ్గరగా కూడా రావు. నేను బీజేపీ ఆరోపణలను చాలా పెద్దగా తీసుకోను." అని డీకే శివకుమార్ చెప్పుకొచ్చారు. దీంతో ఆయన బీజేపీలో చేరనున్నారనే వార్తలకు చెక్ పడింది.

